క్లుప్తంగా

కంది పంటకు మంచు దెబ్బ



గంటాపురం వద్ద దెబ్బతింటున్న కంది పంట

బత్తలపల్లి: మండలంలో కంది ఏపుగా పెరిగి పూత, పిందె, కాయదశకు చేరుకుంది. అయితే మంచు దట్టంగా కురుస్తుండడంతో పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది పంటకు నష్టం జరగకుండా వేప నూనెను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

బదిలీ సిబ్బందికి సన్మానం



బదిలీ అయిన పోలీసులను సన్మానించిన సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన సిబ్బందిని బుధవారం తోటి సిబ్బంది సన్మానించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్‌పీఎస్‌ఐ సూర్యనారాయణ ధర్మవరానికి, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటరమణ ఓడీసీకి, మురళీమోహన్‌రెడ్డి కనగానపల్లి మండలాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 9,10 తేదీల్లో నిరసన



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 9, 10 తేదీల్లో మండల వ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కదిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదానీ గ్రూపు కంపెనీల అవినీతి తప్పిదాలలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలని, అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధునాయక్, లియాకత్, ఆదెప్ప, ఈశ్వరయ్య, చౌడప్ప, రమణ పాల్గొన్నారు.

రోశయ్య లేనిలోటు పూడ్చలేనిది



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొణిజేటి రోశయ్య లేనిలోటు పూడ్చలేనిదని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర పొలిటికల్ చైర్మన్ పెనుజూరు నాగరాజు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుజూరు నాగరాజు మాట్లాడుతూ రాజకీయాల్లో రోశయ్య తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు ఆర్వేటి కిషోర్, కర్ణాటకం ముకుంద, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం మీడియా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కలవల నాగతేజ, దేవతా శ్రీనివాస్, అంబటి అవినాష్, నామా రాజా, గోపా చంద్రకాంత్, విజయ్, రజిని, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఓడీచెరువు : వెంకటాపురం పంచాయతీ నల్లగుట్టపల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అధికార పార్టీని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, గణపతి, సాయిలీల, రామిరెడ్డి తదితరులు బుధవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. మృతి చెందిన కూలీలను మస్టర్‌లో చేరిస్తే ఒక పర్సంటేజీ, వలస పోయినవారికి ఒక పర్సంటేజీ చొప్పున దండుకుంటున్నారని ఆరోపించారు. పనిచేయకున్నా పనిచేసినట్లు రికార్డు చేసి.. డబ్బు స్వాహా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా విచారణ చేపడతామన్నారు.

ముందుకు సాగని చదువులు





తనకల్లు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు, ఎస్ఎంసీ సభ్యులు

విద్యా సంవత్సరంలో కీలక సమయాన బోధనకు ఆటంకం ఏర్పడింది. సిలబస్ పూర్తి చేసి రివిజన్‌కు సన్నద్ధమవ్వాల్సిన సమయంలో పాఠాలే ముందుకు సాగలేదు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టారు. వారి విజ్ఞప్తులను పరిశీలించి.. సమ్మెను విరమింపజేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడంతో గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో చదువులు అటకెక్కాయి.

- అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె
- 20 రోజులుగా బోధనకు దూరం
- సిలబస్ పూర్తికి తీవ్ర ప్రతిబంధకం
- పదో తరగతి విద్యార్థులకు కీలక సమయం
- ఇదీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో దుస్థితి

తనకల్లు: గురువులు కరువై.. బోధన కనుమరుగై సీజీ ప్రాజెక్టు వద్దనున్న గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఐదు నుంచి పదో తరగతి వరకు మొత్తం 450 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. 19 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో పాటు మరో ఇద్దరు రెగ్యులర్ టీచర్లు పనిచేస్తున్నారు. పదేళ్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సదరు టీచర్లు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోవడం లేదని అవుట్‌సోర్సింగ్ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయింపు ఇవ్వాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, రెగ్యులర్ లేదా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ)గా మార్పు చేయాలని తదితర డిమాండ్లతో గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నవంబర్ 16 నుంచి సమ్మె బాట పట్టారు. వీరికి రెగ్యులర్ టీచర్లు కూడా మద్దతు తెలిపారు. 20 రోజులుగా బోధన పూర్తిగా నిలిచిపోయింది.

సిలబస్ పూర్తయ్యేదెన్నడు?

ఈ విద్యా సంవత్సరంలో ఈ సమయానికి సిలబస్ పూర్తి కావాల్సి ఉన్నా కాలేదు. సమ్మె కారణంగా పదో తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడింది. గురువులు లేక తమ పిల్లల చదువులు అటకెక్కాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి.. బోధన సజావుగా సాగేలా చూడాలని పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా తిరుపాల్



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని గీతామందిరంలో వడ్డెర సంఘం కదిరి డివిజన్ అధ్యక్షుడు కుంచెపు గంగరాజు ఆధ్వర్యంలో బుధవారం మండల వడ్డెర సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా డేరంగుల తిరుపాల్, ఉపాధ్యక్షుడిగా వేమయ్య, ప్రధాన కార్యదర్శిగా వీరా తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను నాయకులు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు దొడ్డెప్ప, ఆనంద్, రైతు సంఘం నాయకుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

బత్తలపల్లి: భూ సమస్యలతో పాటు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఆరో తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆరో తేదీ గరిశలపల్లి, 10న దంపెట్ల, 11న ఓబుళాపురం, 12న సంగాల, 13న అప్పరాచెరువు, 17న బత్తలపల్లి, 18న ఈదుల ముష్టూరు, 19న మాల్యవంతం, 20న డి.చెర్లోపల్లి రెవెన్యూ గ్రామాల్లోని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు తమ అర్జీతో పాటు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌ను తప్పనిసరిగా అందజేయాలని తహసీల్దార్ కోరారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాబురావు బుధవారం తెలిపారు. ఈ నెల ఆరో తేదీన చామచేనుబైలు, పదో తేదీన సోమయాజులపల్లి, 11న జీనులకుంట, 12న టి.పెద్దతండా, 13న కురుమామిడి, 17న వేపరాల, 18న జి.పెద్దతండా, 19న మలమీదపల్లి, 20న చామాలగొంది, 24న మడుగువారిగొంది, 26న కటారుపల్లి, 27న గొడ్డువెలగల, 31న కమతంపల్లి, జనవరి 2న తుమ్మలబైలు, 3న మద్దివారిగొంది, 7న గాండ్లపెంట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనుపమ బుధవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆరో తేదీన కొట్లపల్లి రెవెన్యూ గ్రామం, 10న సాతార్లపల్లి, 11న పెడపల్లి, 12న నిడిమామిడి, 13న జగరాజుపల్లి, 17న కప్పలబండ, 18న అమగొండపాళ్యం, 19న వెంగళమ్మచెరువు, 20న ఎనుములపల్లి, 24న బీడుపల్లి, 26న బ్రాహ్మణపల్లి, 27న పుట్టపర్తి రెవెన్యూ గ్రామంలో సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించండి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ సభ్యులు

పుట్టపర్తి: మడకశిర మండలం ఆముదాలగొంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జబీజ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసూనలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏడీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చేతన్‌ను మేనమామ బయటకు తీసుకెళ్లి హత్య చేయడం దారుణమన్నారు. ఈ ఘటనకు ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ నాయక్, దొడ్డం రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కన్నీరు



బనాన్‌చెరువుపల్లిలో మొలకలు వచ్చిన ధాన్యం చూపుతున్న మహిళా రైతు వరలక్ష్మి



యర్రచేనుపల్లి సమీపంలో నేలకొరిగిన వరిపంట

గాండ్లపెంట: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంట చేతికి వచ్చే సమయంలో తుపాను చుట్టుముట్టింది. చిన్నచిన్న కమతాల్లో తిండి గింజలు పండించుకోవాలని చాలామంది రైతులు వరినాట్లు వేశారు. పంట చేతికి వచ్చింది. కొందరు ఇళ్లకు, కల్లాలకు ధాన్యం చేర్చారు. ఇంతలో తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం కాస్తా తడిచిపోయింది. మొలకలు వచ్చి ఎందుకూ పనికిరాకుండాపోయిందని మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి రైతులు వరలక్ష్మి, శివశంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యర్రచేనుపల్లిలో వరిపంట నేలకు ఒరిగిందని రైతు రెడ్డప్ప తెలిపాడు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు పలువురు రైతులు తంటాలు పడుతున్నారు.



బనాన్‌చెరువుపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



వంకపల్లి సమీపంలో తడిసిన ధాన్యాన్ని కల్లంలో ఆరబోస్తున్న రైతు

సరికొత్త ఆలోచనలతో విజయం



కాటలిస్ట్-2024 ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని టీసీఎస్ సంస్థ టోస్ట్ మాస్టర్ వెంకట్రామ్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో కాటలిస్ట్-2024 ఫెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రామ్ ప్రసంగిస్తూ బీబీఏ పూర్తి చేసిన విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న వాటికంటే బయటి ప్రపంచంలో ఎన్నో కొత్త ఆలోచనలు, కొత్త సవాళ్లు ఎదురవుతాయన్నారు. పరిస్థితులకు తగినట్లు నడుచుకోవాలన్నారు. తమ అనుభవాన్ని మెరుగుపరుచుకుంటేనే విజయం సాధిస్తారన్నారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన విద్యార్థులకు నిర్వహించిన పోటీలో పలువురు ప్రతిభ కనబరిచారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్ బాల కోటేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ సెంటర్ల ఏర్పాటు

కదిరి టౌన్: అపార్ నమోదులో విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ కోసం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో గురువారం నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఆర్డీఓ సన్యాసి క్రిష్ణశాస్త్రి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ సేవలు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

నల్లచెరువు/ ఎన్‌పీ కుంట: భూ సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల ఆరో తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు నల్లచెరువు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే సదస్సులో అర్జీలు సమర్పించాలన్నారు. మండల వ్యాప్తంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌పీకుంట డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్ కోరారు.

పంట నమోదు తప్పనిసరి



చెరువువాండ్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ భారతి

నల్లచెరువు: రబీలో పంట సాగు చేసే రైతుల తప్పనిసరిగా రైతు సేవ కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలని ఏఓ భారతి సూచించారు. చెరువువాండ్లపల్లిలో బుధవారం ఏఓ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480, వరికి రూ.630, టమాటకు రూ.1,600 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సేంద్రియ వ్యవసాయం విత్తనశుద్ధితో పాటు వ్యవసాయ శాఖ పథకాలు, నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్, డ్రిప్, పశు సంవర్ధక శాఖ వివరాలను రైతులకు వివరించారు.

డ్రోన్ పైలట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిమర్రి: ప్రభుత్వ నమో డ్రోన్ పైలట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎం సాంబశివుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పొలాలకు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేయడం కోసం డ్రోన్ పైలట్‌ను నియమించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. డ్రోన్ పైలట్‌గా ఎంపికయ్యే మహిళలకు విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలుగా ఉండి, ఇంటర్మీడియెట్, ఆపైన చదివిన 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో పూజారి మృతి



మృతుడు చంద్రశేఖర్‌రాజు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం, రాఘువంపల్లి గ్రామాల రామాలయ పూజారి చంద్రశేఖర్‌రాజు (56) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, నాయకులు ముళ్లగూరి వెంకటేష్, వినాయక ట్రస్టు సభ్యులు వేర్వేరుగా రూ.10వేల చొప్పున చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సంజీవపురం గ్రామ ప్రజలు కూడా ఆర్థిక సాయం చేశారు. చంద్రశేఖర్‌రాజుకు భార్య, కుమార్తె ఉన్నారు.

పశువులకు గడ్డుకాలం!

- దోమకాటుతో పాల దిగుబడిపై ప్రభావం



పాడి పశువులు

బత్తలపల్లి: వ్యవసాయం తరువాత రైతులు అధికంగా ఆధారపడి జీవిస్తున్నది పాడిపరిశ్రమే. రైతులు పాడి పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. శీతాకాలం పశువులకు గడ్డుకాలం. పంట పొలాల కోతతో దోమలు పశువులపై విజృంభిస్తాయి. దీంతో పాల దిగుబడి తగ్గి తద్వారా రైతుకు ఆదాయం తగ్గుతుందని బత్తలపల్లి పశువైద్యాధికారి గర్నాథరెడ్డి తెలిపారు. పశువులపాకలో తగినన్ని సౌకర్యాలు కల్పించి, పరిశుభ్రంగా ఉంచితే మంచి దిగుబడి సాధించవచ్చని అంటున్నారు. అధిక పాడిని ఉత్పత్తి చేయడమే కాకుండా ఆ పాలు పరిశుభ్రంగా, నాణ్యమైనవిగా ఉంచడానికి ప్రయత్నించాలని, అందుకుగాను రైతులు పాలు పితికే సమయంలోను, వాటిని కేంద్రాలకు తరలించే సమయంలోను తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ముష్టికోవెల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సరిత

చెన్నేకొత్తపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ సరిత వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ముష్టికోవెల గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో చిన్నారులు, గర్భవతులకు వేసే వ్యాధి నిరోధక టీకాల వివరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పని చేసే వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట నారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయం ఏఎన్ఎం కుమారి ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న స్కూల్ నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై దృశ్యాత్మక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు, మొబైల్ ఫోన్ ఉపయోగించడం వల్ల జరిగే ప్రమాదాల గురించి, హెల్మెట్ వాడటం వల్ల ప్రమాదాల నుంచి ఎలా బయటపడవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



రాంబొజ్జి నాయక్ ఫైల్ ఫోటో

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండా మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాంబొజ్జి నాయక్ (81) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రాంబొజ్జినాయక్‌కు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రీమియం చెల్లించాలి



కుర్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తలుపుల: వేరుశనగ, వరి, టమాట సాగు చేసే రైతులు పంటల బీమా కోసం తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలని ఏడీఏ షమీవుల్లా తెలిపారు. మండల పరిధిలోని ఈదులకుంట్లపల్లి, కుర్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి షాదాబ్ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.